సునీతి

ఆ రోజు ఆఫీసులో అందరికీ ఆశ్చర్యమే!

సునీతి ఉద్యోగానికి రాజీనామా చేసింది!

ఆఫీసులో ఎవరైనా కొత్త ముఖాలు చేరినా.... పాత ముఖాలు పోతున్నా....అది సంచలనం కలగచేసేదేనన్నమాట!

అయితే....సునీతి విషయంలో మరికొంత విశేషం వుంది!

ఆఫీసులో కొత్త ముఖమే!....ఇంకా ఆమెను గురించిన ....'కల్యాపరీక్షలు' పూర్తి కాలేదు మిగతా ఉద్యోగులకి! మరీ అంత 'రిజర్వ్‌డ్'గా (మిగతావారి పరిభాషలో కొరుకుడు పడని ఆడది!) వుండటం....వలన సమాచార సేకరణ కొంత కష్టమే అవుతోందిపాపం!

ఈ మధ్య కనకరాజు 'కాజువల్ లీవ్'లన్నీ—

ఖర్చుకావటానికి కారణం అదే! నారాయణరావు 'పర్సులో–నీర్సం' పేరుకోడానికి అదే కారణం!-సినీమా హాళ్ళల్లో— సెంటర్‌లో....బస్సుస్టాప్‌లో సునీతికోసం కాపువేయవలసిన డ్యూటీ నారాయణ రావుది!—ఎందుచేతంటే నారాయణరావు భార్య పురిటికి వెళ్ళింది। ఇలా పురుళ్ళకి వెళ్ళే సీజన్‌లో ఎవరుంటారో....సదరు భార్య తాలూకు భర్త....ఆఫీసులో మిత్రులసలహా ననుసరించి.... 'జేబుఖర్చులు' భరించవలసి వస్తుంది।

ఇంకా పెళ్ళికాని కుర్ర బ్రహ్మచారి మోహన్ రావు—ఉదయ, సాయంకాలాలు–సునీతి ఇంటి అడ్రసు పట్టుకోడమనే తాపత్రయంలో వున్నాడు!-అదీ వృథాయే అవుతోంది!—

నిజానికి ఈ విషయాలేమీ సునీతికి తెలియవు!-ఆర్డర్ కాగితం అందుకుని–ఆఫీసులో చేరింది। కాఫీ గ్లాసు అందిస్తూ "చూడమ్మా! ఆఫీసు చాలా దూరం అనుకుంటాను. రోజూ ఇలా కష్టపడాలంటే ఎలా?" అంది.

ప్రశ్నలో అభిమానమూ వుంది....ఆక్షేపణా కలిసింది!!

సునీతికి కాఫీ గ్లాసులో రెండు నలకలు, ఓ చీమ, గ్లాసు అంచు మీద అట్టకట్టిన మామిడి పండు రసం తాలూకు ఛాయలు కనిపించి 'ఇంటా



— వేదుల శకుంతల

ఉద్యోగంలో చేరిన మొదటిరోజు....దూరపు చుట్టం ఇంట్లోదిగి పెట్టే బేడాపడేసి–ఆదరాబాదరా ఆఫీసుకు పరిగెట్టింది!

సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూ....'తన భావిజీవితం ఎలా గడుస్తుందా? అనీ ఎక్కడైనా ఒకగది దొరికితే బాగుండుననే' ఆలోచనలతో.... మెల్లగా చుట్టాలింట్లో అడుగుపెట్టింది....అంత క్రితం వాళ్ళు ఏం మాట్లాడుకున్నారో గానీ...చాలా ముభావంగా–పలకరిస్తే ....అతక్కుపోతుందేమో నన్న భయంతో ప్రవర్తించేరు!–చుట్టాలిళ్ళకి వెళ్ళి వాళ్ళని నానా ఇబ్బందులపాలు చేయడం.... విసిగించడం లాంటివే వింటాంగానీ–రెండో వైపు నుంచి ఆలోచించి....వివేకంగా మసలడం మాత్రం ఎందరికి తెలుసును?–ఆ ఇంటి యజమానురాలు పక్కవాటా పిన్నిగారి సలహా ననుసరించి.... సునీతిని అతి తొందర్లో ఇంట్లోనుంచి పంపే ఏర్పాటులో...మొదటి మెట్టుగ – ఆ సాయంత్రమే విడ మనస్తత్వం మాద్వారా తెలుసుకో' అని హెచ్చరించేయి!

అందుకే సునీతి బుర్ర చురుకుగా పనిచేసి "అమ్మయ్యో! కాఫీ రెండోసారి ఇంత తాగను పిన్నిగారూ! మీరు సగం తీసుకోండి" అని గ్లాసు తిరిగి అందించబోయింది. కాని పిన్నిగారు చాలా ఇబ్బంది పడింది. ఆ కాఫీ స్పెషల్‌గా సునీతి కోసం తయారుచేసింది! డికాక్షన్ గుడ్డ పిడిచి మరీ వంచింది గ్లాసులోకి. తనకి ఆ వాసన గిట్టదు. అందుకని ఓ గ్లాసులోకి సగం వంపి – అక్కడ ఆడుకుంటున్న అఖరబ్బాయిని తాగమంది. కుర్రవెధవ! 'అమ్మ మళ్ళీ కాఫీ ఇచ్చిందే' అనుకుని గుటుక్కున తాగేసేడు! సునీతి బలవంతాన తాగి "ఆఫీసు దగ్గరలో గది చూస్తున్నాను పిన్నిగారూ! ఒకటి రెండు రోజుల్లో వెళ్ళిపోవాలి. అనవసరంగా బస్సులకి, రిక్షాలకి దండగ పెట్టడం ఎందుకు? నాల్గు గిన్నెలు, డబ్బాలు తెచ్చాను. ఓ స్టవ్ కొనుక్కుంటే

హాయిగా వండుకుని తినవచ్చు. ఆఫీసుకి దగ్గరా వుండవచ్చును. ఏమంటారు పిన్నిగారూ?" అన్నది కాఫీ గ్లాసు కడుగుతూ.

"అనేందుకేముందమ్మా, దివ్యంగా ఉంటుంది. అయ్యో, కాఫీ గ్లాసు అక్కడ పడేయ్. పనిపిల్ల కడుగుతుంది!" అన్నది పిన్నిగారు. అప్పటికే సునీతి కడగటం అయిపోయింది.

ఆ రాత్రి సునీతి నిద్రపోలేదు. తెల్లవారితే ఏం చేయాలా అని తెల్లవార్లూ ఆలోచించింది.

అలా ఆ అమ్మాయి ఆలోచిస్తోందనీ, సతమత మవుతోందనీ తెలియని పిన్నిగారు, రెండో ఆట చూసి వచ్చిన మొగుడిగార్కి వడ్డిస్తూ, "అమ్మో మనం ఏమో అనుకున్నాంగానీ ఆ పిల్ల అన్నిటినీ సిద్ధం చేసుకునే వచ్చింది. కట్టుకున్న భర్తని వదిలి ఉద్యోగం మోజులోపడ్డ ఆడది ఆ మాత్రం తెగించదూ? నీతి సూత్రం మర్చిపోయినదానికి మంగళసూత్రం ఓ అడ్డా?" అన్నది కొంత ఛీత్కారం కలిపి.

సునీతి అదిరిపడి ఆ తర్వాత బోర్లా పడుకుని తలగడను తడిపేసుకుని ఆవేదన తీర్చుకుంది.

మర్నాడు ఆఫీసు నుంచి ఇంటికి రాలేదు. ఇల్లు కోసం చుట్టు పక్కల వీధులన్నీ గాలించింది.

ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలప్పుడైనా అన్ని ప్రశ్నలు వినాల్సి రాలేదు. ఓ చిన్న గది కోసం సునీతి జీవిత వివరాలన్నీ అడిగేరు ఇంటి గల వాళ్ళందరూ.

"ఒక్కదానివే వుంటావా?" అని ఓ అనుమానపు ఇల్లాలి ఆరా!

'మీ ఆయన ఏ ఊళ్ళో వుంటాడూ?' — అన్నాదొక ఇంటి యజమాని.

'ఫలానా ఊరంటున్నావ్! ఏ పేట? ఇంటి పేరు?'—ఆ వరుసతో తనిఖీ చేసిందొక చాదస్తురాలు. సునీతికి ఒళ్ళు మండిపోయింది! అయినా అవసరం తనది! ఆ పైన తనకి అర్జంట్‌గా గది దొరికి తీరాలి! అందుకోసం చచ్చిపోతున్న సహనాన్ని బ్రతిమాలుకుంటూ, ఒంట్లో నీర్సాన్ని కసిరి గొడుతూ లేని శాంతాన్ని అరువు తెచ్చుకుని— ఆఖరికి జయించింది!

ఏమిటీ?—- ఓ చిన్న పంచపాళీ!

ఇంటి అద్దెలమీదే బ్రతుకున్న ఓ బామ్మగారి, కూలిపోతున్న మండువా లోగిట్లో రెండు సంసార పక్ష కుటుంబాలు. మరొక రెండు—పిల్లల్ని చదివించుకునేందుకు పట్నం కాపురాలు పెట్టిన కుటుంబాలు. మధ్యగా మిగిలిన వరండాలాంటి ఖాళీ ప్రదేశం వూరికే వుంచేయడం ఇష్టం లేక — బామ్మగారు స్వయంగా వెదురు తడికలు కట్టి, వాటికి రేగడిమట్టి పూసి వెల్లవేసి గదిలా తయారుచేసింది. దాని అద్దె పన్నెండు రూపాయలు మాత్రమే! పైగా కరెంటు, పంపుకి ఇచ్చుకోవాలి. సునీతిని అట్టే ప్రశ్నలు వేయలేదు.

ఆ గది అద్దెకివ్వడమే ప్రధానం గనుక బామ్మగార్కి సునీతిలాంటి ఒంటి ఆడది నచ్చింది.

తనకి గది దొరకడమే ప్రస్తుత కార్యం అనుకున్న సునీతికి బామ్మగారు తన వివరాలేవీ అడక్కపోవడం మరీ నచ్చింది.

వెంటనే అడ్వాన్సు ఇచ్చేసి, వీధిలోకి వచ్చి చకచకా నడుస్తున్నప్పుడు సునీతికి ఓ అనుమానం, మరొక భయం కలగాపులగంగా చుట్టుముట్టేయి!

'ఎప్పుడైనా తండ్రి తనని చూడ్డానికి వస్తే ఈ గదిలో ఎలా వుండగలడు? తమ సొంత ఊళ్ళో ఆవుల్ని, గేదెల్ని కట్టే దూళ్ళ కొట్టం కూడా బామ్మగారు అద్దెకిచ్చిన నాలుగు కుటుంబాల ఇళ్ళ కంటే విశాలంగా వుంటుంది. అయినా నాన్న వచ్చేలోపులో వేరే ఇల్లు చూసుకుంటే సరి'— అని సరిపెట్టుకుని మర్నాడే వచ్చి చేరింది.

నాల్గురోజులు మామూలుగా .... 'ప్రపంచం చాలా మంచిదే....మనుష్యులు మరీ మంచివాళ్లు!'- అనిపించేలాగ గడిచిపోయాయి సునీతికి, ఇంటా బయటా! – ఆ తర్వాతే .... ప్రపంచంలో వుండే మరొక ప్రపంచం .... మనిషిలో వుండే మరొక మనిషి....కన్పించసాగేరు!

ఆ రోజు ప్రొద్దుటే సునీతి పెరట్లో పంపు దగ్గర కూజాలో నీళ్ళు పట్టుకుంటోంది!....పక్క వాటాలో .... చదువుకునే కుర్రాడు .... ప్యాంటు, బనియన్ వేసుకుని పైమీద టవల్ కప్పుకుని.... చేతిలో ఫ్లాస్కుతో .... పంపుగట్టుకు ఓ గజం దూరంలో....నుంచున్నాడు. సునీతి ఓసారి అతని వైపు చూసి .... మళ్ళీ ఇటు తన పని చూసుకోసాగింది! —

"ఏమండీ!" అన్నాడా కుర్రాడు.

"ఏమిటండీ?" అన్నది ఇటు తిరిగి.

"మీరు గ్రాడ్యుయేటా?—అబ్బే వూరికే అడుగుతున్నాను" సంజాయిషీ ఇచ్చుకుంటూ ప్రశ్న అడిగి, వెర్రి బాగుల్గా ఓ చిన్న నవ్వు నవ్వి, నుంచున్న ఆ కుర్రాడు అచ్చంగా తమ వూళ్ళో చదువుకుంటున్న తమ్ముళ్ళాగానే అనిపించేడు సునీతి కళ్ళకి!

అందుకే తనూ ఓ చిన్న నవ్వు విసిరి 'మరే! అలానే వుంది సర్టిఫికెట్‌లో!" అన్నది.

"అబ్బో! గడుసుగా చెపుతున్నారే?! ఔనూ, ఏ ఆఫీసులో వున్నారు?" అన్నాడు.

చెప్పింది—

"ఏ సెక్షన్?"

అదీ చెప్పింది—

"పని ఎక్కువ వుండదాండీ?"

"ఉద్యోగంలో వున్నాక పని ఎక్కువ అనుకుంటే కుదురుతుందా? అయినా ఏదీ, నేనిప్పుడే గదా చేరిందీ! చూడాలి ఎలా వుంటుందో" అంటూ పంపు కట్టేసి కూజా చేత్తో పట్టుకుని ఓ అడుగు వేసింది ముందుకు.

"అవునులెండి, ఇంకా క్రొత్త గదా? ఐనా ఆడవాళ్ళకి హెవీ వర్కు ఇవ్వరులెండి. మగవాళ్ళకే ఆ బాధలన్నీ! అవునూ, అసలు మీరు జాబులో చేరాల్సిన అవసరం చాలా వుందా.... అహఁ అబ్బే! అసలు సరదా కోసం చేసేవాళ్ళుంటారు గదండి. అందుకని అడుగుతున్నాను...."

సునీతి ఆ కుర్రాణ్ణి ఓసారి చూసి "పోనీ అలాగే అనుకోండి!" అన్నది. అని మరి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా గబగబా తన వాటా వైపు నడిచింది.

పది నిముషాలు అవలేదు. అంతే, ఆ కుర్రాడి వాటాలో నుంచి ఆ అబ్బాయి మేనత్తో, పినతల్లో, మరే వరుసో...."ఏరా? అయ్యాయా యోగక్షేమాలూ? ఆ పిల్లతో నీకేం కబుర్లు? నీ చదువు సంధ్య సంగతి చూసుకోకుండా! పంపు దగ్గర ఆ భాగోతమేమిటీ? ఏదో వండి పెట్టున్నందుకు నా మాట దక్కించి, నీ చదువు గట్టెక్కించుకో. ఆ తర్వాత ఉద్యోగం వచ్చాక నువ్వెన్ని వేషాలు వేసినా ఇబ్బంది లేదు" అని మందలింపు వినిపించింది.

కుర్రాడి జవాబు వినాలనిపించలేదు సునీతికి. సాటి ఆడది! ఎంత తొందరగా మాట విసిరిందా— అని చివుక్కుమన్నది మనస్సు! కొన్ని పదాల్లో కొరడా దెబ్బలంత చురుకు వుంటుంది.

అదే నోరు మంచిగలవాళ్ళ మాటల్లో నోట్ల కట్టలు మూట కట్టిచ్చినంత ఊరట దొరుకుతుంది. ఉద్యోగం వచ్చాక ఎన్ని వేషాలైనా వెయ్య వచ్చునా? ఎవరూ? మగవాడా? ఏం ఆడది వెయ్య కూడదా?? నాతో మాట్లాడితే భాగోతమా? అంత చులకన చేయాల్సిన అవసరం ఏమిటి ఆవిడకి? చెప్తాను తనేమిటో, తన పరువు ఏమిటో! సమయం వచ్చినప్పుడు చెప్పాలి!—అనుకుంటూ గబగబ పనులు ముగించుకుని ఆఫీసుకు వెళ్ళి పోయింది.

ఆఫీసులో....

ఎవరి సీట్లలో వాళ్ళు అతుక్కుపోయినట్టు కూర్చున్నారు! ఓరగా కోరగా మధ్య మధ్య వెకిలిగా చూపులు విసురుతూ! చకచకా పనులు చేస్తున్నారు! చేస్తున్నట్టు నటిస్తూ వున్నారు. సునీతికి ఆఫీసర్‌గారి పిలుపు వచ్చింది. లేచి వెళ్ళింది. మళ్ళీ తిరిగి వచ్చేటప్పటికి—కనకరాజు మోహన్‌రావుకేదో చెప్తూ కన్ను గీటేడు!

నారాయణరావు నవ్వుతున్నాడు.

సునీతిని చూసి....సర్దుకుని కూర్చున్నాడు! మౌనంగా తన సీటు దగ్గరికి వెళ్ళిపోయింది. లంచ్ అవర్‌లో మోహన్‌రావు అడిగేడు. "సునీతి గారూ! మీరు వచ్చి అప్పుడే వారం రోజులు కావస్తోంది. మరి మాకందరికీ నీళ్ళయినా పోయ లేదు. అన్యాయం కదండీ?—పోనీ ఈ రోజు మా నోర్లు కాస్త తియ్యబరచకూడదూ?"—అన్నాడు చొరవగా.

సునీతికి నిజమే ననిపించింది!—'అలాగే' అంది!

కాంటీన్ వైపు నడిచేరు అందరూ!! ఆడ వాళ్ళలో సునీతి, మరియమ్మ, ప్రిస్రోషియా అనే ఆంగ్లో ఇండియన్, యామినీ అనే ఓ పాతి కేళ్ళ పడుచు వున్నారు. మరియమ్మ నల్లబై ఏళ్ళుంది అందర్నీ 'బిడ్డా' అనే పిలిచేది. ప్రిస్రోషియా ఎప్పుడూ పెట్రొమాక్స్ లైట్లా చిరు నవ్వులు చిందిస్తూ, మగ, ఆడ భేదం లేకుండా అందర్నీ సమానంగానే పలకరించేది! యామినీని చూస్తే....పాపం మగవాళ్ళే కాస్తగా జంకినట్టు వెనక్కి తగ్గేవారు. జుట్టూ, శరీరం ఒకే రంగులో నిగనిగలాడేవి!!—ఒక్క సునీతే కాస్త కంటి కింపుగ....అందరాని పండులా కన్పించింది! అందుకే ఆరాటం!

కాంటీన్‌లో కావాలని మోహన్‌రావు సునీతికి ఎదురుగ నుంచుని సీటు లేనట్టు టిఫిన్ తింటు



న్నాడు. "ఇవాళ సునీతిగారి పర్సు ఖాళీ చేయిస్తా వేంట్రా? చాల్లే నీ ఆర్డర్లు!" అన్నాడు నారా యణరావు—గులాబ్ జామ్ ప్లేటు ఆశగా అందుకుంటూ.

"వెధవ జోకులు వెయ్యకండి నారాయణ రావుగారూ! సునీతిగారి పర్సు ఖాళీ అవుతుందనా లేక, నా తిండి మీదా మీ విసురు?" అన్నాడు. అనీ "కావలిస్తే మీరూ తెప్పించుకు తినండి! సునీతిగారు ఇవ్వలేకపోతే నేనిస్తా బిల్లు"—అని కూడా అన్నాడు.

"మంచివారే! మీరు ఇవ్వటమేమిటి.... ఈ రోజు ఎంత బిల్లు అయినా నేనివ్వాల్సిందే." అన్నది సునీతి, మంచి మనసుతో—

"అదీ అలా అనండి! మా నారాయణరావు గారు ఎప్పుడు కాంటీన్ కొచ్చినా నా తిండి మీద ఏడ్చి బిల్లు దగ్గర పేచీలే పెడ్తారు. ఇంక ఈ దెబ్బతో ఆయన ఆట కట్టు!" అన్నాడు మోహన్‌రావు సగం నారాయణరావుని చూస్తూ, సగం సునీతిని చూస్తూ.

సునీతి నవ్వి వూరుకుంది.

మిగతా వాళ్లు అంతగా పట్టించుకోలేదు.

బిల్లు పాతికరూపాయలు సునీతి ఇచ్చేసింది.

కనకరాజు, నారాయణరావు ఓసారి భుజాలెగర వేసుకుని ముఖాలు చూసుకుని వంకరగా నవ్వు కుని ఆ పైన 'పాపం!' అనుకున్నారు.

పాతికరూపాయలు ఖర్చు పెట్టేస్తే ఇల్లు గడ వడం ఎంత కష్టమో!...గొప్పకి పెట్టేసింది—అను కున్నారు. అయినా అవసరం అనుకున్నప్పుడు మనం అలాగే పెట్తాం గదా...ఆడదైనా వెనకాడ కుండా పెట్టింది! 'ఫర్వాలేదు దారిలోకొస్తోంది!' అనుకున్నారు. ఆ రోజు సాయంకాలం ఆఫీసు బయటికి వస్తున్నప్పుడు ఫరొక సెక్షన్‌లో వుండే సత్యనారాయణ, మోహన్‌రావు భుజం చరిచి "అదృష్టం నీది! జాగ్రత్తగా వుంటే దబ్బుకి యిబ్బంది పడక్కర్లేదు. ఇందాక మన 'ఎర్ర తేలు' నాకు ఊదేసింది! పాతికరూపాయలు బిల్లు ఇవ్వగల్గింది అంటే మరింకేమీ అనుమాన పడక్కర్లేదు!" అంటూ చిన్నగా చెప్తున్న మాటలు సునీతి చెవుల్లో పడ్డాయి. ఉలిక్కి పడింది.

ఎర్రతేలంటే ప్రిట్రోషియా అన్న మాట— అనుకుంది.

తను మామూలుగా, సరదాగా చేసిన పనికి వీళ్ళంతా గోతులు తవ్వుతారనీ తన్ను—'నిలువెత్తు నీతి నుంచి బయటపడి స్వేచ్ఛా విహారం చేస్తున్న చవకబారు ఆడదానిగా'— అంచనా వేస్తారనీ అనుకోలేదు. ప్రొద్దుట ఇంటి దగ్గర సాటి ఆడదీ అలాగే వాగింది! ఇప్పుడు వీళ్ళూ అలాగే కూస్తున్నారు! 'ఛీ వెధవ మనుష్యులు' అనుకుంది!

అలాంటి వెధవమనుష్యులు ప్రపంచం అంతటా వుంటారు! ఆఫీసుల్లోనే గాదు. స్కూళ్ళల్లోనూ, కంపెనీల్లోనూ, గవర్నమెంటు ఉద్యోగస్థుల్లో, ప్రైవేటు జాబుల్లో, ఏ పనీ లేని అమ్మలక్కల్లో అన్ని పనులూ వున్నట్టుండే సొసైటీ లేడీస్‌లో ఇంట్లో, వీధిలో అన్నిటా మంచి మనసున్న వాళ్ళ ప్రక్క 'ఈ వెధవ మనుష్యులూ' వుంటారు! నిజంగా వాళ్ళుండబట్టే ఇన్నేసి కథలు, జీవితాలు బయటపడుతున్నాయి!—లేకపోతే 'రామరాజ్యం'లా వుంటే ప్రజలకి కాలక్షేపం ఏదీ?! రామాయణంలో రామచంద్రమూర్తి పట్టాభిషేకం తర్వాత 'చాకలి కూతకి' మళ్ళీ కథ ముందుకు సాగలేదూ? ఇకపోతే అడవుల్లో 'వనవాసం అజ్ఞాతవాసం' పూర్తి చేసుకుని వస్తే కథ అంత రక్తి కట్టేదా?— లక్ష్మణస్వామి మూడు గీతలు గీసి 'దాటి రాకు వదినమ్మా'- అంటే సీతాదేవి దాటే వచ్చింది! నిజానికి ఆవిడ ధర్మం చేయాలనే సత్సంకల్పంతోటే వచ్చింది. అయినా అనర్థమే ఎందుకు జరగాలీ?—బహుశా ముందు తరాలవారికి బోధచేసేలా వుండాలనా? అయితే రావణాసురుడి మాటో? ధర్మం చేయబోతున్న సీతమ్మని ఎత్తుకు వెళ్ళి సర్వనాశనం అయాడు గదా?— మరి అది 'విలన్' లాంటి వాళ్ళకి కనువిప్పు కల్గించదేం? నీతి సూత్రం ఆడదానికేనా? మగవాడికి వర్తించదా?

కాలం మారింది! యుగం మారింది!

కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలూ మారేయి! ఒకనాడు 'స్త్రీ ధనం' వాడితే అధర్మం అన్న వాళ్ళు, ఈనాడు స్త్రీ ధనమే ఆధారం అనుకుంటున్నారు. అయినా సినిమాల్లో, కథల్లో మాత్రమే చూడగల్గే 'ధర్మమే జయిస్తుంది' అన్న ముగింపు నిత్యజీవితాల్లో మాత్రం హాస్యాస్పదంగా నిలిచిపోతోంది!

ఆడదానికెప్పుడూ రక్షణ లేదు. ఆవిడకి స్వేచ్ఛ లేదు! ఆమెను నిల్చోబెట్టి, చుట్టూ నిలువెత్తున నీతి సూత్రాలు పాతి, దాటి బయటికి వస్తే 'చెడిన ఆడ'దని అచ్చు గుద్దుతారు.



అందుకే సునీతి, 'తన పేరులోనే 'నీతి'ని నిల్పి అమ్మా, నాన్నా చిన్నప్పట్నుంచీ తనని బంధించేరా?' అనుకుని వెర్రిగా నవ్వుకుంది. అది ఎప్పుడూ అంతే—కథా గమనంలో.... ఆఫీసులో కొలీగ్స్ వ్యంగ్య ధోరణి విన్నాక సునీతి చాలా రిజర్వ్‌డ్‌గా జాగ్రత్తగా వుండటం మొదలుపెట్టింది.

మోహన్‌రావు వాళ్ళు శతవిధాల ఆమెను సన్నిహితం చేసుకోవాలని ప్రయత్నిస్తూనే వున్నారు. అప్పుడప్పుడు అసభ్య ధోరణి కూడా చూపబోయేరు. భరిస్తూనేవుంది. అది అలా వుండగా—

ఇంటి దగ్గర ఓ ఆదివారంనాడు ఇంటి యజమానురాలు, పక్క వాటా ఇల్లాలు, చదువుకునే కుర్రాడి మేనత్తా కలిసి మ్యాట్నీకి వెళ్ళారు. అవతల పక్క వాటాలోని గృహిణి—అర్జంట్ రాచకార్యం మీద పక్క ఊరు చుట్టాలింటికి వెళ్ళింది. ఇంటి మొత్తం మీద సునీతి తప్ప ఆడపురుగు లేదు. మగవాళ్ళూ, కాలేజీ కుర్రాళ్ళూ ఓ వాటాలో చేరి పేకాట మొదలుపెట్టేరు. ఆడుకోవడం తప్పు కాదు. ఆడుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ 'ఎంజాయ్' చేయడం అంతకన్నా తప్పుకాదు. ఆ కబుర్లు పరాయివాళ్ళపైన చెప్పుకున్నా బాధలేదు. కానీ ఆ కబుర్లు పక్క వాటాలో ఒంటరిగా వున్న ఆడకూతుర్ని గురించి....అదీ ఆమెకు వినిపిస్తుందని తెలిసీ — చెప్పుకోవడం ఎలా భరించడం? తడికెల గదిలో తుంగచాప మీద పడుకుని నవల చదువుకుంటున్న సునీతిని రకరకాలుగా వర్ణించుకుంటూ, విమర్శించుకుంటూ జోరుగా పేకాట ఆడుకుంటున్నారు మగమహారాజులు!

పది నిముషాలు, పావు గంట సేపు విన్నది. సహించింది. ఇంకా అసహ్యంగా అసభ్యంగా, "రేటెంతో కనుక్కుందామా?" అనేసరికి, తోక తొక్కిన తాచులా పుస్తకం విసిరికొట్టి లేచి నుంచుంది. విసురుగా తలుపు తీసుకుని బయటికి వచ్చి, వాళ్ళ గుమ్మం దగ్గర నిలబడి "చూడండీ—" అని అరిచింది.

అరడజను మంది మగవాళ్ళూ ఒక్కసారి ఉలిక్కిపడి ఆట ఆపేసి చూసేరు! అపరకాళిలా గుమ్మంలో నిల్చున్న సునీతిని చూచి అదిరిపోయారు!

"మీరిందాకట్నుంచి ఏదో వాగుతున్నారు. అందుకే వచ్చాను. నా రేటెంతో....మీ ఆడవాళ్ళ నడగండి చెప్తారు. ఎందుకంటే వాళ్ళకు అనుభవాలుంటాయి గదా? అందుకని చెప్పి నిర్ణయిస్తారు!" అనేసరికి—

"నోర్మూయ్!" అన్నాయి నాలుగు మగ కంఠాలు కోపంగా.

గట్టిగా నవ్వి, "అదేం? మీవాళ్ళు చెప్పరా?" అన్నది.

"నీకూ వాళ్ళకీ పోలికా? సంసారం చేసుకునే ఆడవాళ్ళకి, నీలా ఒంటరి ఆడదానికీ తేడా లేదూ?" అన్నాడొక పౌరుషవంతుడు.

"ఉంది! ఉంది! చాలా వుంది! మగవాడు చాటు వుంటే ఆడదానికి కావల్సినంత నీతి అండగా వుంటుంది. లేకపోతే ఇలాగే అడ్డమైన వెధవలకి అలుసు అవుతుంది. పోనీ మీలో ఎవరైనా నాకు అండగా నిలుస్తారా? నా జీతం మూడు వందలు, కాక నాపేర రెండెకరాల పొలం వున్నది. మా వూళ్ళో నా వాటా డాబా ఇల్లు వుంది. అమ్మితే పదివేలు వస్తుంది. బాంకులో నా నగలు ఆరు వేల ఖరీదువి దాచేను. మా నాన్న మామిడి తోటలో సగం రాసిస్తానన్నాడు. అన్నీ కలిపితే యాభై వేల ఆస్తికి వారసురాల్ని! గవర్నమెంటు ఉద్యోగస్థురాల్ని! ఎవరైనా సరే—ముందుకు వచ్చి న్యాయసమ్మతంగా నన్ను పెళ్ళి చేసుకుంటే సంతోషిస్తాను. చెప్పండి మీలో ఎవరికైనా ఆ ధైర్యం, మానవత్వం వుందా? నాకు ఇంతకు మునుపు అయిన పెళ్ళి రద్దు చేసుకొని ముందుకు వస్తాను!"

ఆరుగురు ఇంకా తేరుకుని జవాబు చెప్పేలోపల మ్యాట్నీకి వెళ్ళిన బొమ్మగారు, మిగిలిన ఇద్దరు ఆడాళ్ళు టికెట్ దొరకలేదని వచ్చేసేరు!

తడికె చాటు నుంచి సునీతి, ఇలా మగాళ్ళు పేకాట ఆడుకుంటున్న గది ముందు నిల్చొని సవాల్ చేస్తున్న దృశ్యం కంటబడేసరికి—ఇంకేముందీ? కొంప లంటుకుని పొగలు, సెగలు, హాహాకారాలు అంతెత్తున లేచిపడ్డాయి.

'మగవాళ్ళు ఎన్నో అనుకుంటారు. ఆడది ఎదురుపడి నిలేస్తుందా?'—'అంత ఆస్తి వుంటే, ఈ ఉద్యోగమెందుకు?'—'మొదటి పెళ్ళి కాదనడానికి రెండో పెళ్ళి అడ్డా?'—'నీతి లేని ఆడదానికి ఇక్కడ సంసారాలు చేసే చోట చోటు లేదు' బొమ్మన్నారు. 'నీలాంటి ఆడదానికి ఇలాంటి తడికెల గది సరిపడదు. సిమెంట్ కాంక్రీటు చేసిన గదిలో తాళం కప్ప వేసి వుంచాలనీ....ఆఫీసులో ఈ సవాళ్ళన్నీ వేయక పోయావా అనీ....నోటికి వచ్చినన్ని దులిపేరు, ఆడవాళ్ళు.

మగవాళ్ళు పేకాట కట్టిపెట్టి, ఎవరి వాటాలోకి వాళ్ళు జారుకుని 'పాపం! పోనీలెండి. ఆ పిల్ల తెలియక ఏదో వాగింది. ఊరుకోండి యిక!' అన్నట్టు చూడసాగేరు.

సునీతి చెప్పే నిజాన్ని ఎవరూ వినలేదు!

ఆ రాత్రి సునీతి చాప మీద బోర్లా పడుకొని—కరువుతీరా ఏడ్చింది.

'తను యాభై వేల రూపాయలకి హక్కుదారు, నిజమే! కానీ ఎప్పుడూ? తనూ భర్తా కోర్టు ద్వారా విడాకులు పుచ్చుకుంటే, తనకి మనోవర్తి క్రింద అవన్నీ ఇస్తారు. కానీ తనకి కోర్టుకెక్కడం ఇష్టం లేక, తనకున్న బి.యే. సర్టిఫికెట్‌తో తన బ్రతుకు తను బ్రతుకుదామని వచ్చింది. ప్రపంచంలో మంచీ, మానవత్వం ఇంకా వున్నాయనుకుని వచ్చింది! న్యాయం, ధర్మం పచ్చగా బాగున్నాయనుకుని వచ్చింది! పురాణకాలం కాదు కనుక నీతి సూత్రం మగవాళ్ళకి, ఆడవాళ్ళకి సమానమే అనుకుని వచ్చింది.

'కానీ సమాన హక్కులు అన్నింట్లో కాదనీ, ఆడదెప్పుడూ ప్రగతి సాధించలేదనీ తెలుసుకుని—ఒంటరిగా ఆడది ఉద్యోగం చేసుకుంటూ ప్రశాంతంగా జీవించడం ఈ యుగంలో కాదు కాబోలు—అనుకుని—ఉద్యోగం వదిలేసి వెనక్కి వెళ్ళిపోవడానికి నిశ్చయించుకున్నది!

ఒకవేళ విడాకులు తీసుకుని ఆస్తి దక్కించుకుని బ్రతుకుదామన్నా—అప్పుడు మాత్రం ఒంటరి ఆడది కాదా?—

అందుకని ఉద్యోగం, ఆస్తి రెండూ వద్దని—భర్తతో కాపురం చేయడానికే నిర్ణయించుకుంది—

ఇంతకీ ఆ భర్త సంసారానికి అనర్హుడు!

ఆ విషయం డాక్టర్లే ఋజువు చేశారు!!

కోర్టు విడాకులు తీసుకోవడానికి అనుమతిచ్చింది. కానీ సునీతి ఆ భర్తతో కాపురం చేయడానికీ, చేస్తున్నట్టు నటించడానికీ, తన్ను వంచించుకుంటూ బ్రతకడానికీ దృఢపరుచుకుని—ఆ రాత్రి నిద్దరపోయింది.

మర్నాడు—

ఆఫీసులో అందరికీ ఆశ్చర్యమే!

సునీతి రాజీనామా చేసింది!

కనకరాజు, నారాయణరావు, మోహన్‌రావు—ఇంకా 'శల్య పరీక్షలు' పూర్తి చేసుకోక ముందే సునీతి రైల్లో కూర్చుంది.

రైల్లో, కిటికీ దగ్గర పమిట నిండుగా కప్పుకొని కూర్చున్న సునీతి—దూరంగా మైదానంలో జరుగుతున్న సభలు....బోర్డులు చూసి విరక్తిగా నవ్వుకుంటూ—'ఈ ప్రయత్నాలన్నీ మళ్ళీ యుగానికి పునాదులు' అనుకుంటూ ముఖం తిప్పుకుని, కన్నీరు తుడుచుకుంది. □

పుస్తకాలు

మిథ్యాబింబాలు
(కథల సంపుటి)

[రచన: డాక్టర్ కె. వి. కృష్ణకుమారి; క్రౌను 1/8 సైజులో 240 పుటలు. వెల: రూ. 10-00; ప్రచురణ: 1975 జూన్‌లో. ప్రతులకు: సాహితీ కేంద్రము, విజయవాడ-2]

'మిథ్యాబింబాలు' పది కథలతో కూర్చిన సంపుటి. ఈ పది కథలూ తాను స్కూల్ విద్యార్థినిగా ఉన్నప్పుడే వ్రాసినవని రచయిత్రి చెప్పుకున్నారు. అందుచేత దాదాపు తొమ్మిదేళ్ళ ముందే వ్రాసిన ఈ కథలను రచయిత్రి అప్పటి ప్రాయాన్ని దృష్టిలో ఉంచుకుని చదవడం ఆమె రచనకు న్యాయం చెయ్యడం అవుతుంది.

ఈ కథల్లో 'మిథ్యాబింబాలు' కథలో డాక్టర్ వేణు పాత్ర చిత్రణ చక్కగా ఉంది. ఈ కథలో—కలలలో బతకడం సాధ్యం కాదని రచయిత్రి కొత్త విధంగా వివరించారు. 'రచయిత్రి' కథ నేటి స్త్రీల పరిస్థితుల గురించిన చక్కని పరిశీలన. 'తనదాకా వస్తే' అన్న చివరి కథలో సంఘటనలు వర్ణించిన తీరు బాగుంది.

'దూరపు కొండలు', 'కర్మయోగి', 'శాంతిప్రియ', 'ఆత్మార్పణ', 'కాళరాత్రి నవ్వింది', 'నువ్వు పాసయ్యావు రవీ!' 'స్త్రీ' మొదలైన తక్కిన కథలు కూడా ఈ సంపుటిలో ఉన్నాయి. ఈ కథలన్నీ రచయిత్రి కల్పనాశక్తికి మంచి ఉదాహరణలు. కథల్లో భాష మాత్రం అంత బాగాలేదు.

ఈ సంపుటంలో అచ్చు తప్పులు బాగానే ఉన్నాయి. వెల మాత్రం అంత బాగా ఉన్నట్టు కనిపించదు.

['పుస్తకాలు' శీర్షికలో సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు ఒక్క ప్రతిని పంపితే చాలు. ఆ పుస్తకాల ప్రచురణ మాత్రం, ఈ సంవత్సరంలోనే జరిగి ఉండాలి; అవీ స్త్రీల రచనలే అయి వుండాలి.]